తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- **ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**

కొత్తకోట,అక్టోబర్ 3 : మున్సిపాలిటీ కేంద్రంలో పబ్లిక్ హెల్త్ మున్సిపల్ శాఖ, విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి గురువారం కొత్తకోట పట్టణ అభివృద్ధి, తాగు నీటిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ పట్టణంలో 3కిలో మీటర్ల మేర ప్రతి వీధిలో సీసీ రోడ్లు, అవసరం ఉన్న చోట డ్రైనేజీలను నిర్మించాలని, నూతనంగా నిర్మించబోయే సీసీరోడ్ల వద్ద రోడ్లు తవ్వకుండా ముందుస్తుగా తాగు నీటి నిర్మాణం సంబంధించిన పైపులైన్లు వేయాలని సూచించారు. భవిష్యత్‌లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా శాశ్వత నీటి పరిష్కారం దిశగా కృషి చేయాలని, నిధుల లోటు లేకుండా చూసుకుంటానని తెలిపారు. అదే విధంగా పాత గ్రామ పంచాయతీ స్థలంలోనే భూసేకరణ అవసరం లేకుండా నూతన మున్సిపాలిటీ భవనాన్ని నిర్మించడానికి అవకాశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. అదే విధంగా పట్టణంలో విద్యుత్ సమస్యలు లేకుండా లోడ్ ఎక్కువగా ఉన్న ఫీడర్లను విభజించి, కొత్త ఫీడర్లను ఏర్పాటు చేయాలని, దాని సంబంధించిన నిధులను మంజూరు చేసి సమస్యను పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ శాఖ ఈఈ విజయ్‌భాస్కర్, ఏఈ ప్రశాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, కృష్ణారెడ్డి, బోయేజ్, మేస్త్రీ శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్ర రాజధానికి వీవీ ప్యాట్ల తరలింపు

వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

- **కలెక్టర్ సంతోష్**

గద్వాల, అక్టోబర్ 3 : పార్లమెంట్ ఎన్నికల సమయంలో పనిచేయని వీవీ ప్యాట్లను హైదరా బాద్‌లోని ఈసీఐఎల్‌కు తరలిస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాంలను నెలవారి తనిఖీలో భాగంగా గోదాంలో ఉన్న అన్ని ఈవీఎంలు, వీవీ ప్యాట్లను సమగ్రంగా పరిశీలించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు 2024పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సమయంలో పనిచేయని 8 వీవీప్యాట్లను హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు సురక్షితంగా తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో గద్వాల తాసీల్దార్ మల్లికార్జున, ఎన్నికల విభాగ అధికారి నరేశ్, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల సర్వేను సమర్థవంతంగా పూర్తిచేయాలి

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే తీరును అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు

- **అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు**

కేటీదొడ్డి, అక్టోబర్ 3 : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు అధికారులకు ఆదేశించారు. మండలంలోని మైలగడ్డ గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే తీరును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని మైలగడ్డ గ్రామాన్ని ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కార్యక్రమం కింద చేపడు తున్న ప్రయోగాత్మక ఇంటింటి సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ప్రతి ఇంటింటికి వెళ్లి వారి పూర్తి సమాచారాన్ని సర్వే ఫారంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంటి యజమానిగా మహిళా పేరు ఉండాలని, తదుపరి కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలని సూచించారు. సర్వేను పకడ్బందీగా తప్పులు లేకుండా కుటుంబంలో ఎంత మంది ఉన్నారో వారి వివరాలు నమోదు చేయాలన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమోహన్, ఇన్‌చార్జి తాసీల్దార్ శివ శంకర్, ఆర్ దేవేందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు

అయిజ, అక్టోబర్ 3 : అర్హులైన ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డును అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆర్డీవో రాంచందర్ అన్నారు. గురువారం అయిజ మున్సిపాలిటీలోని మూడో వార్డులో డిజిటల్ కార్డు కోసం అధికారులు ఇంటింటి సర్వే చేపట్టగా ఆర్డీవో పరిశీలించారు. డిజిటల్ కార్డుల ఎంపికకు అయిజ మున్సిపాలిటీలోని మూడో వార్డును ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిందని తెలిపారు. ప్రభుత్వం అందించిన జాబితాలో 178 కుటుంబాలు ఉన్నాయని, అందులోని కుటుంబాల వివరాల తోపాటు అదనంగా కుటుంబాలు ఉంటే పొందుపర్చాలన్నారు. తప్పొప్పులకు తావు లేకుండా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, మేనేజర్ అశోక్‌కుమార్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సాహిత్య సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

వనపర్తి టౌన్, అక్టోబర్ 3 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 23న జరిగే అంతర్జాతీయ తెలుగు సాహిత్య సదస్సును జయప్రదం చేయాలని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ కోరారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం వనపర్తిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్గీయ కపిలవాయి లింగమూర్తి సాహిత్యం శీలనం అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ సదస్సు ఆఫ్ లైన్, ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని ఆసక్తి గల సాహితీ వేత్త లు పాల్గొనవచ్చని సూచించారు. కపిలవాయి వ్యాసరచనలో సామాజిక, చారిత్రక, ఆధ్యాత్మిక, కులవృత్తులు, ఆలయాల, స్థానిక చరిత్ర, సాహిత్య విమర్శ తదితర అంశాలపై 5 పేజీలకు మించకుండా తమ వ్యాసాలను ఈ నెల 15వ తేదీలోగా కళాశాల తెలుగు విభాగానికి పంపాలని సూచించారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు బైరోజు చంద్రశేఖర్, అంబటి భానుప్రకాశ్, శ్యాంసుందర్, ప్రధానోపాధ్యాయులు గణేశ్‌కుమార్, వరప్రసాద్‌రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బొద్దారెడ్డి, మహిపాల్ రెడ్డి, రవీందర్ గౌడ్ ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు పీహెచ్‌సీ ఆవరణలో కంచె లోపల ఉన్న మొక్కలను మేస్తున్న గొర్రెలు

కంచె ఉన్నా.. పచ్చదనం జీవాలపాలు

గట్టు, అక్టోబర్ 3 : వన సంరక్షణకు ప్రభుత్వం రూ.కోట్ల వ్యయం చేసి పచ్చదనానికి ప్రాధాన్యమిచ్చింది. అయితే మొక్కల సంరక్షణకు పట్టింపు ఇప్పుడు పూర్తిగా కరువైంది. గట్టు పీహెచ్‌సీ ప్రాంగణంలో మొక్కలు నాటి వాటికి కంచె ఏర్పాటుచేశారు.

అయితే రక్షణను పట్టించుకోకపోవడంతో గొర్రెలు కంచెలో పలకు వెళ్లి మొక్కలను మేస్తున్నాయి. ఈ దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' గురువారం క్లిక్ మనిపించింది.

మదనాపురం పెద్ద అమ్మవారి శాలలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

శాంతినగర్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గద్వాల పట్టణంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు

- **విశిష్ట పూజలందుకున్న అమ్మవారు**

నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, అక్టోబర్ 3: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆలయాలన్ని విద్యుత్ దీపాలంకరణలో వెలిగిపోతున్నాయి. ఆయా ఆలయాల్లో ఉదయం 6గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు రాజరాజేశ్వరీగా, దీక్షా బంధన దేవీగా, బాలాత్రిపుర సుందరి దేవీగా, శాఖంబరిగా, శైల పుత్రిగా, లలితాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు.

మండపాల్లో కొలువుదీరి..

అమ్మవారి శరన్నవరాత్రులకు ఏడాదికేడాది ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ఈ ఏడాది అమ్మవారిని కొలిచేందుకు ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేశారు. పలు కాలనీలలో, ఆలయాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఆయా మండపాల్లో ఉదయం 6గంటల నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ధ్వజా రోహణం, గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, గోపూజలతో పాటు వివిధ జలాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. అలాగే సాయంత్రం ఆయా ఆలయాల్లో కుంకుమార్చనలు చేశారు.

గద్వాల జిల్లా కేంద్రంలో..

దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గద్వాల కోటలోని భూ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి విశిష్ట పూజలను చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం రాత్రి స్వామివారిని పూల పల్లకీపై ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.

మహాలక్ష్మీ దేవీ అలంకరణలో దర్శనమిస్తున్న జములమ్మ

బీచుపల్లి క్షేత్రంలో బాలాత్రిపురసుందరి దేవీ అలంకరణలో అమ్మవారు

అయిజ : బాలా త్రిపుర సుందరిదేవీ అలంకరణలో అంబా భవాని

కేతేపల్లిలో బాలాత్రిపుర దేవీగా దర్శనమిస్తున్న అమ్మవారు

ప్రతి ఇంటి నుంచి వివరాలను సేకరించాలి

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి టౌన్, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి డిజిటల్ గుర్తింపు కార్డు జారీ చేసేందుకు కార్యాచరణ ప్రారంభించిన నేపథ్యంలో ప్రతి ఇంటి నుంచి వివరాలను సేకరించాలని అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి డిజిటల్ సర్వే బృంద సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి ఒక డిజిటల్ గుర్తింపు కార్డు జారీ చేసేందుకు కార్యాచరణ అక్టోబర్ 3 నుంచి ప్రారంభించిందని, అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ప్రతి జిల్లాలో ఒక మున్సిపల్ వార్డు, ఒక గ్రామ పంచాయతీలో కుటుంబ వివరాలను సేకరించనున్నట్లు చెప్పారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అంజనగిరి గ్రామం, జిల్లా కేంద్రంలోని 10వ వార్డులను పైలట్ ప్రాజెక్టులుగా గుర్తించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీకి రెండు బృందాలు, మున్సిపల్ వార్డుకు మూడు బృందాలను ఏర్పాటు చేసి ప్రతి బృందానికి టీం లీడర్‌గా తాసీల్దార్, ఎంపీడీవో స్థాయి అధికారులను నియమించారు. అక్టోబర్ 7 సాయంత్రం లోగా సర్వే పూర్తి చేసేందుకు గడువు విధించారు. కుటుంబంలో ఎక్కువ వయస్సు కలిగిన మహిళను కుటుంబ యజమానిగా గుర్తించాలని, ప్రతి కుటుంబం ప్రతి వ్యక్తి సర్వేలో నమోదు కావాలని ఆదేశించారు. కుటుంబ సర్వేలో అధారాలు అడగాల్సిన అవసరం లేదని, కుటుంబ సభ్యులు చెప్పిన రీతిగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ బృంద సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డీఆర్డీవో ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, తాసీల్దార్లు రాజు, రమేశ్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో భానుప్రకాశ్, బృంద సభ్యులు, వార్డు ఆఫీసర్లు, ఆశవర్కర్లు ఉన్నారు.

పైలట్ ప్రాజెక్టుగా అంజనగిరి , 10వ వార్డు ఎంపిక..

తెలంగాణ కుటుంబ గుర్తింపు కార్డు సర్వేలో పైలట్ ప్రాజెక్టుగా జిల్లా కేంద్రంలోని 10వ వార్డు, మండలస్థాయిలో అంజనగిరి గ్రామాన్ని ఎంపిక చేసినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుటుంబ సర్వేను ప్రారంభించి సర్వేను పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా పోయిన డేటాబేస్‌లో పరిశీలన చేశారా అని టీం లీడర్‌ని అడిగారు. డేటా బేస్‌లో పేర్లు ఉన్న వారికి ఫారం వన్‌లో నమోదు చేసుకొని డేటా బేస్‌లో పేర్లు లేని వారి వివరాలను ఫారం 2లో నమోదు చేసినట్లు తాసీల్దార్ రాజు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, టీం లీడర్లు , తాసీల్దార్లు రాజు, రమేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అధికారులు విధిగా హాజరు కావాల్సిందే

వనపర్తి టౌన్, అక్టోబర్ 3 : రోడ్డు భద్రతా సమావేశానికి సంబంధిత అధికారులు విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రోడ్డు, భవనాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా త్రైమాసిక సమావేశం గురువారం నిర్వహించారు. సంబంధిత అధికారులు కొంత మంది గైర్హాజరు కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరు కానీ వారికి షోకాజ్ నోటీసు జారీ చేసి వచ్చే వారం పూర్తిస్థాయి సమావేశం నిర్వహించాలని రోడ్డు, భవనాలు శాఖ కార్యవర్గ ఇంజినీర్‌ను ఆదేశించారు. రోడ్డు భద్రతపై గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు వాటి అమలుపై పూర్తి నివేదికలు సమావేశంలో లిఖిత పూర్వకంగా ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారిపై గుర్తించిన ప్రమాద భరిత బ్లాక్ స్పాట్లు తీసుకున్న భద్రతా చర్యలు, హెల్మెట్ ధరించని రైడర్లు పరిమితికి మించి ప్రయాణం చేసే వాహన చోదకులపై వేసిన జరిమానాలు తదితర పూర్తి నివేదికతో సమావేశానికి రావాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో రోడ్డు, భవనాల కార్యనిర్వాహక ఇంజినీర్ దేశనాయక్, పంచాయతీరాజ్ ఇంజినీర్ మల్లయ్య, డీఎస్పీ కృష్ణ కిశోర్, ఆర్టీవో మానస పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల, అక్టోబర్ 3 : పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మల్దకల్ మండలంలోని ఎల్కూరు గ్రామానికి చెందిన బుగ్గనకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2లక్షల ఎల్‌వో సీని గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు జంబురామన్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, మోషన్న పాల్గొన్నారు.

నాటు వైద్యంపై నమ్మకంతో ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దు

వనపర్తి టౌన్, అక్టోబర్ 3 : పాముకాటుకు ప్రత్యేకమైన చికిత్స జిల్లా దవాఖానలో 24గంటలు అందుబాటులో ఉంటుందని, నాటు వైద్యంపై నమ్మకంతో ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్ సూచించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత నెల 30న గోపాల్‌పేట మండలం ఏదుల గ్రామానికి చెందిన బాలమ్మ అనే వృద్ధురాలు నాగుపాము కాటుకు గురైందని బాధితురాలిని స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ సరైన సమయంలో దవాఖానకు తీసుకొచ్చారన్నారు. నాలుగురోజులపాటు ప్రత్యేకమైన చికిత్స అందించి బాలమ్మను కాపాడి కొలుకున్నాక ఇంటికి పంపామని చెప్పారు. అనంతరం స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ మాట్లాడుతూ పాముకాటుకు గురైన వారికి ప్రభుత్వ జిల్లా దవాఖానలో 24 గంటల చికిత్స సదుపాయం ఉందన్నారు. ప్రతి నెలా 20 నుంచి 25 మంది పాము కాటుకు గురైన ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. సమావేశంలో ఆర్ఎం, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డా క్షేమం

అలంపూర్, అక్టోబర్ 3 : మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన సువర్ణ అంబులెన్స్‌లో ప్రసవించగా తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు 108 ఈఎంటీ శేఖర్ పైలట్ దేవేందర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే అలంపూర్ మండలం ఊట్కూరుకు చెందిన సువర్ణకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. వారు అలంపూర్‌లోని సీహెచ్‌సీకి తరలించగా అక్కడ వైద్య సిబ్బంది గర్భిణిని పరీక్షించి కర్నూల్ దవాఖానకు రెఫర్ చేయగా 108లో తరలించారు. మార్గమధ్యంలో ఆమెకు నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది రోడ్డు పక్కన అంబులెన్స్‌ను ఆపి ప్రసవం చేశారు. అయితే తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు వారు తెలిపారు. అలంపూర్ సీహెచ్‌సీకి మహిళలు ఎక్కువ శాతం ప్రసవాల కోసం వెళ్తుండగా అక్కడి సిబ్బంది మాత్రం మరో దవాఖానకు రెఫర్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక పక్క ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని ఓ పక్క వైద్యాధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తుంటే వైద్య సిబ్బంది పక్క రాష్ట్రాల దవాఖానలకు రెఫర్ చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ప్రసవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

అమరచింత, అక్టోబర్ 3: ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందని, నేరాల నియంత్రించేందుకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సురేశ్ పేర్కొన్నారు. మండలంలోని మిట్టనందిమల్ల గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పంచాయతీ భవనంలో గురువారం ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సర్వారెడ్డి, నాయకులు వెంకటయ్య, శేఖర్, ఆంజనేయులు ఉన్నారు.

నేడు ఆలయ పాలక మండలి ప్రమాణస్వీకారం

అలంపూర్, అక్టోబర్ 3 : అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ పాలక మండలి శుక్రవారం కొలువుతీరనుందని ఆలయ ఈవో పురేందర్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. 14మంది ధర్మకర్తలతో పాలక మండలి ఏర్పడిందని నేడు ఉదయం 9 గంటలకు ప్రమాణస్వీకారం ఉంటుందని ఈవో పేర్కొన్నారు.

రేపటి లోగా పూర్తి చేసుకోవాలి

గద్వాలటౌన్,అక్టోబర్ 3 : డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు ఈనెల 5వ తేదీ లోగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలని డీఈవో రవీందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చేపట్టిన పరిశీలన కార్యక్రమాన్ని గురువారం డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 346 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆయనతోపాటు ఎంఈవో సురేశ్, విద్యాధికారులు నరేశ్, ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణ, విజయలక్ష్మి, రవీంద్రబాబు, అమరేందర్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన

పాన్‌గల్, అక్టోబర్ 3: మండలంలోని కేతేపల్లి గ్రామసమీపంలోని గుండ్ల చెరువుకు వెళ్లే మట్టిరోడ్డులో గురువారం రాత్రివేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, కుంకుమ, మని షిని పోలిన బొమ్మను గీసి క్షుద్ర పూజలు చేశారు. దీంతో దారినుంచి పొలాలకు వెళ్లే రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాసులు సిబ్బందితో అక్కడికి చేరుకొని వాటిని తొలగించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఎస్సై గ్రామప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాంగోపాల్, కర్మ, రమేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

పాఠశాలను పునః ప్రారంభించాలి

మల్దకల్, అక్టోబర్ 3 : మండలంలోని ఎద్దుల గూడెం ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ప్రకాశ్ డిమాండ్ చేశారు. గురువారం ఎద్దుల గూడెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిగా పాఠశాలను తెరవక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు తప్పిదాల వల్ల పాఠశాల మూత పడిందన్నారు. అయితే అతని స్థానంలో ఇంకోకరిని నియమించి పాఠశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎంఈవో, డీఈవోలు ఈ సమస్యను పరిష్కరించి దసరా సెలవుల అనంతరం పాఠశాలను తెరిచి పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. లేకుంటే జిల్లా కేంద్రంలో గ్రామస్తులతో కలిసి ధర్నాకు చేస్తామని హెచ్చరించారు.

సైబర్ క్రైం కేసు నమోదు

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 3 : సైబర్ క్రైం కేసు నమోదైన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై సురేశ్ గౌడ్ కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన సింగన మోని కృష్ణయ్య (హోంగార్డు) చెందిన యూనియన్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.2వేలు డబ్బులు డ్రా అయినట్లు అతడి ఫోన్‌కు వచ్చింది. దీంతో అప్రమత్తమైన కృష్ణయ్య వెంటనే బ్యాంక్‌కు వెళ్లి వివరాలు సేకరించాడు. కానీ అప్పటికే ఆయన ఖాతా నుంచి రూ.14,500 డ్రాచేశారని బ్యాంక్ అధికారులు చెప్పాను. దీంతో అతను తన ఏటీఎం పోయిందని దాని సహాయంతో తనకు తెలియకుండా డబ్బులు డ్రా చేశారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి

గద్వాల టౌన్, అక్టోబర్ 3: కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా దవాఖాన ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దవాఖాన ప్రాంగణంలో పరిసరాలను చీపురు పట్టి శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రా రెడ్డి, కృష్ణవేణి, బండల పద్మావతి, రామాంజనేయులు, శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల పర్యటన

మల్దకల్, అక్టోబర్ 3 : మండల కేంద్రంలో త్వరలో నిర్వహించే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ మండల నాయకులు వివిధ గ్రామాల్లో పర్యటిస్తున్నారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతునాయుడు ఆదేశాల మేరకు గురువారం మండలంలోని పెద్దపల్లి, పాల్వాయి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలను కలిసి వారి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. మండల కేంద్రంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంపై చర్చిస్తూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, తిరుమల్ నాయుడు, తిరుమలేశ్, తిమ్మప్ప, నాగరాజు, పరశురాముడు, ఆంజనేయులు, రంగస్వామి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పాల్వాయిలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న నాయకులు

కోర్టు ఆవరణంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన

వనపర్తి టౌన్, అక్టోబర్ 3: జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో బార్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌యాదవ్, కార్యదర్శి బాలలింగయ్య మాట్లాడుతూ మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మహ్మద్ ఖలీం అనే న్యాయవాదిపై పోలీసులు